క్లుప్తంగా

2న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మండవల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బేతపూడి ఏసేపురాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి గంగానమ్మ సంబరాలు



ముదినేపల్లి: స్థానిక కోసూరు రోడ్డులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి ఎనిమిదవ వార్షిక సంబరాలు గురువారం నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఘంటసాల మండలం పాప వినాశన గ్రామానికి చెందిన చావలి దుర్గా మల్లికార్జున దీక్షితులు బ్రహ్మత్వంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 31వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఘటాన్ని రెండో తేదీ వరకు గ్రామంలో ఊరేగిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారు ఆలయ ప్రవేశం, అనంతరం మొక్కులు తీర్చుకునే కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సబ్సిడీపై ఎరువుల పంపిణీ



మండవల్లి: మండలంలోని కానుకొల్లులో వ్యవసాయ ప్రాథమిక సొసైటీ ద్వారా రైతులకు సబ్సిడీపై బుధవారం ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే వ్యవసాయ రాయితీలను రైతులు వినియోగించుకుని, దళారుల ద్వారా నకిలీ ఎరువులను కొనుగోలు చేసి మోసపోవద్దని పేర్కొన్నారు. సర్పంచ్ ఎస్.థామస్, మాజీ సర్పంచ్ జి.కోటేశ్వరరావు, నీటి సంఘం చైర్మన్ ఎన్వీవీ నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ సి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

4న గంగానమ్మ పునఃప్రతిష్ట

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ శ్రీగంగానమ్మ అమ్మవారి పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆగస్టు 4న నిర్వహిస్తామని దేవస్థానం డెవలప్‌మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా గంగానమ్మ, పోతురాజుస్వామి, నాగబంధ, సింహవాహన, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 2న గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, 3న వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తుబలి, 4న నిత్యవిధి, పీఠపూజ, యంత్రస్థాపనలు ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



తోట్లవల్లూరు: పర్యావరణ పరిరక్షణకు రోటరీ తనవంతు కృషి చేస్తోందని రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని యాకమూరులో రోటరీ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. కడియపు లంక నుంచి ప్రత్యేకంగా తెచ్చిన రూ. 30 వేల విలువైన మొక్కలను నాగ సుబ్రహ్మణ్యం గ్రామంలోని పలు ప్రభుత్వ భవనాల ప్రాంగణాల్లో నాటడంతోపాటు గ్రామస్తులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తనూజ, చొప్పరపు వెంకటేశ్వరరావు, జబ్బా కృష్ణ ప్రసాద్, బొమ్మారెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, అంబటి సతీష్, దాసరి ఆంజనేయులు, వల్లూరి నాంచారయ్య పాల్గొన్నారు.

వార్షిక సంబరాలకు తిరుపతమ్మ ఆలయం ముస్తాబు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ఆగస్టు 1వ తేదీ శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జరిగే వార్షిక సంబరాలకు ముస్తాబైంది. అమ్మవారి ఆలయంతో పాటు నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం అఖండ దీపారాధనతో సంబరాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. అనంతరం మాను(మహాలక్ష్మీ) పూజ, అమ్మవారికి గ్రామ పొంగళ్ల సమర్పణ జరుగుతుందన్నారు. సాయంత్రం గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి ప్రభ బండ్లు ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరుతాయని చెప్పారు. రాత్రికి శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు అమ్మవారు గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఊరేగింపు అనంతరం తిరిగి ఆలయ ప్రవేశం చేస్తారని వివరించారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయశాఖ ఏడీఏ కవిత



దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ కవిత, ఏఓ అనంతలక్ష్మి

గుడివాడరూరల్: ఎరువులను అధిక ధరలకు రైతులకు విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.కవిత ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. గుడివాడ పట్టణం, మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మితో కలసి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, మన గ్రోమోర్ గుడివాడలో 828 కేజీల గ్రోబిప్ అనే ఫెర్టిలైజర్ అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారులు దుకాణాల యజమానులకు సూచించారు. అదేవిధంగా యూరియాకు ఎటువంటి లింకులు లేకుండా అమ్మకాలు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల నిల్వలు, బస్తా ధర అమ్మే వివరాలను అందరికీ కన్పించేలా దుకాణాల ముందు స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలని ఏడీఏ సూచించారు. రైతులు ఆధార్ నంబర్‌తో పాటు వేలిముద్రలు ఇచ్చి దుకాణాల వద్ద ఎరువులు కొనుగోలు చేసి, బిల్లులు తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు, ఇతర వ్యక్తులను ఎరువుల కొనుగోలు చేసేందుకు పంపవద్దని కోరారు. సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే రైతులు లిఖిత పూర్వకంగా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే సత్వరమే వారిపై చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక సర్పంచ్‌గా నాయుడు ఎంపిక



కైకలూరు తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్ఎం నాయుడును అభినందిస్తున్న పంచాయతీ ఈఓ ప్రసాద్, సిబ్బంది

కైకలూరు: కైకలూరు మేజర్ పంచాయతీ తాత్కాలిక సర్పంచ్‌గా 15వ వార్డు సభ్యులు కొటికలపూడి వెంకట నరసింహమూర్తి నాయుడు బుధవారం ఎంపికయ్యారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యులు ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఆయన్ను ఎన్నుకున్నారు. ముందుగా పంచాయతీ ఈఓ వై.ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి సస్పెండ్ అయిన నేపథ్యంలో అదే సామాజిక ఎస్సీ వర్గానికి చెందిన వార్డు సభ్యులకు తాత్కాలిక సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని జీఓలో ఉందని పేర్కొన్నారు. దీంతో 6వ వార్డు సభ్యురాలు బిరుదుగడ్డ రాజమణిని తాత్కాలిక సర్పంచ్‌గా ఉండాలని కోరారు. ఇందుకు ఆమె తనకు చదువు లేదని, ఆరోగ్యం బాగాలేదని తాను స్వీకరించలేనని తెలిపింది.

ఆసక్తి కలిగిన వారు చేతులు ఎత్తాలి

వార్డు సభ్యుల్లో తాత్కాలిక సర్పంచ్‌గా ఉండేందుకు ఆసక్తి కలిగిన వారు చేతులు ఎత్తాలని ఈఓ కోరడంతో కేవీఎస్ఎం నాయుడు మాత్రమే లేచారు. అతడిని ఆమోదిస్తూ 2, 12వ వార్డు సభ్యులు సమయం రామాంజనేయులు, మహమ్మద్ గాలిబ్ బాబు మద్దతు ప్రకటించారు. అనంతరం అందరి వార్డు సభ్యులను నాయుడి ఎంపికపై చేతులు ఎత్తి మద్దతు తెలపాలని అడగడంతో అమన్నా కౌసర్ (1వ వార్డు), సమయం రామాంజనేయులు (2వ వార్డు), గిరి కన్యాకుమారి (3వ వార్డు), పిచ్చికల జయసుధారాణి (4వ వార్డు), పిచ్చికల శివరమ్య (5వ వార్డు), బిరుదుగడ్డ రాజమణి (6వ వార్డు), తోట మహేష్ (7వ వార్డు), మంచికంటి శ్రీనివాసరావు (9వ వార్డు), బుద్దా మహాలక్ష్మీ (11వ వార్డు), మహమ్మద్ గాలిబ్‌బాబు (12వ వార్డు), గుడిపాటి విజయశేషు (13వ వార్డు), రెహనా ఖాతూన్ (14వ వార్డు), బెల్లాని శ్యామలరావు (16వ వార్డు), సమతం శ్రీను (18వ వార్డు), గునుపూడి జ్యోతి (19వ వార్డు), మూడెడ్ల శ్యామలా (20వ వార్డు) సభ్యులు చేతులు పైకెత్తి నాయుడుకు మద్దతు తెలిపారు. పాలకవర్గంలో ఉప సర్పంచ్‌గా ఎన్నికైన 10వ వార్డు సభ్యుడు మంగినేని పోతురాజు, 17వ వార్డు సభ్యుడు పెద్దింటి మురళీధరరావు అనారోగ్య కారణాలతో మరణించారు. ఇక 8వ వార్డు సభ్యుడు మేదూరి నాంచారయ్య ఒక్కరు మాత్రం రాలేదు. చివరకు తాత్కాలిక సర్పంచ్‌గా నాయుడును ఎంపిక చేసినట్లు పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, కైకలూరు, వదర్లపాడు గ్రామాలకు చెందిన కేవీఎస్ఎం.నాయుడు అభిమానులు ఆయన్ను పూలమాలతో సత్కరించారు. ఎటువంటి అనూహ్య సంఘటనలు చోటు చేసుకోకుండా టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



తోట్లవల్లూరులో జ్వరాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. తోట్లవల్లూరు శివారు కనకదుర్గమ్మ కాలనీలో జ్వరాలపై ఇంటింటి సర్వేను ఆరోగ్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఇంటి ఆవరణలో మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బందిని పంపి ఎక్కడా నీరు నిలువ లేకుండా చూస్తున్నట్లు చెప్పారు. దోమల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జీవీవీ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ రత్నం, ఆశా కార్యకర్త స్వాతి పాల్గొన్నారు.

సామిత్వ పథకం అమలుపై శిక్షణ

ముదినేపల్లి రూరల్: డీపీఓ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామిత్వ పథకం అమలుపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ వై.రామకృష్ణ మాట్లాడుతూ సామిత్వ పథకం గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాపింగ్ కోసం ఉపయోగపడుతుందన్నారు. సామాజిక ఆర్థిక సాధికారతను స్వీయ సాధికారతను ప్రోత్సహించడంతో పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఓటీలు శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, డెప్యూటీ ఎంపీడీఓ అశోక్ హాజరయ్యారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రచారం

గన్నవరం రూరల్: ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం ప్రజావేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అదానికి లాభం చేకూర్చేందుకు ఈ మీటర్లు పెడుతున్నారని ఆరోపించారు. ఏపీలో మాత్రం ఈ మీటర్లు ముందుగా పెడుతున్నారని, మిగతా రాష్ట్రాల్లో వ్యతిరేకించారని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలు స్మార్ట్ మీటర్లు పెట్టే వారిని తిప్పి కొట్టాలని, ఇప్పటికే కరెంట్ బిల్లులు అధికంగా వచ్చి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మీటర్లు పెడితే మూడు రెట్లు బిల్లులు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చోట మూడు రెట్లు బిల్లులు అధికంగా వచ్చాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా ఐకమత్యంతో వ్యతిరేకించాలని చెప్పారు. నాయకులు చాగంటిపాటి వెంకటేశ్వరరావు, రమేష్, సోమిశెట్టి శ్రీనివాసరావు, బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడ టిడ్కో కాలనీ నుంచి గుడ్లవల్లేరు మండలం కౌతవరం సబ్ స్టేషన్ వరకు 13 కిలో మీటర్ల మేర రూ.2.20కోట్లతో 33 కేవీ నూతన విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. నందివాడ మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామని, ఇప్పటికే 80శాతం పూర్తయ్యాయని తెలిపారు. గుడివాడ పట్టణంలో ఐదు, నందివాడ మండలం ఎల్ఎన్ పురంలో ఒక హెవీ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏడీలు బాపిరాజు, కిరణ్, ఏఈలు ఉష, బ్రహ్మానందరావు, కుమార్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!



తోట్లవల్లూరు-ఉయ్యూరు రోడ్డుపై ఏర్పడిన గుంత

తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. మేరుగ సుబ్బారావు ఇటుక బట్టీల ప్రాంతానికి ఎదురుగా ప్రధాన రహదారి మార్జిన్ భాగంలో రెండు నుంచి మూడు అడుగుల లోతులో పెద్ద గుంత ఏర్పడింది. ఆదమరచి ప్రయాణిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

\- తోట్లవల్లూరు


నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



కోరుకొల్లు బాలికల ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

కలిదిండి(కైకలూరు): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని వీటి ఏర్పాటులో శ్రద్ధ వహించాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. కలిదిండి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను క్షుణ్ణంగా బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో జరిగే ప్రతి విషయాన్ని పార్ట్-5లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. యువత గంజాయికి బానిసలుగా మారకుండా అడుపు చేయాలని సూచించారు. శక్తి టీం సభ్యులు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి యాప్‌ను సెల్‌లో ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. అనంతరం కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. చిన్నారుల సౌకర్యాలపై చర్చించారు. పోలీసుశాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బాలికలకు స్వీట్లు పంపిణీ చేసి, చదువులో రాణించాలని చెప్పారు. హాస్టల్‌లో సమస్యలు ఉంటే పోలీసు సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి, కైకలూరు ఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు, డి.వెంకట్‌కుమార్, వార్డెన్ నాగమణి పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

కైకలూరు: బీసీ కాలేజీ బాలికల హాస్టల్‌లో నీటి పంపు పాడైంది. ఈ విషయాన్ని ఇటీవల హాస్టల్‌ను సందర్శించిన టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్ఐలు ఆర్.శ్రీనివాస్, వెంకట్‌కుమార్‌కు విద్యార్థులు చెప్పారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు ఇక్కడి పరిస్థితి వివరించారు. ఆయన బుధవారం హాస్టల్‌ను సందర్శించి మోటారు కోసం రూ.10 వేలు వితరణగా అందించారు. అనంతరం యువతకు పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్, శక్తి యాప్‌లపై వివరించారు. పలు చట్టాల గురించి చెప్పారు. కాలేజీకి వెళుతున్నప్పుడు ఎవరైనా ర్యాగింగ్ చేస్తే పోలీసు సిబ్బంది ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్ఐలు డి.శ్రీనివాస్, డి.వెంకట్ కుమార్, వార్డెన్ రాధా పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని స్టేట్ బ్యాంకు వీధిలో తాళం చేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న మహిళ ఒంటరిగా స్టేట్ బ్యాంకు వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆ మహిళ ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లగా దొంగతనం జరిగింది. ఇంటి తాళాలను పగలు కొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు ఇంట్లోని రూ. 2 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకుని పోయారు. దుండగులు తీసుకొచ్చిన కత్తిని అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. బుధవారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చిన నర్సు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితురాలు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశువులను రోడ్లపై వదిలితే జరిమానా

మున్సిపల్ కమిషనర్ మనోహర్



బందుల దొడ్డిని పరిశీలిస్తున్న కమిషనర్

గుడివాడరూరల్: పశువులను రోడ్ల మీదకు యజమానులు ఎవరైనా విడిచిపెడితే వాటిని బందుల దొడ్డికి తరలించి జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ హెచ్చరించారు. పట్టణంలోని 3వ వార్డులోని బందులదొడ్డిని బుధవారం మున్సిపల్ కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందులదొడ్డిలో అన్ని ప్రాథమిక సౌకర్యాలు శనివారం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యజమానులు సోమవారం నుంచి పశువులను రోడ్లపై విడిచి పెడితే.. వాటిని బందుల దొడ్డికి తరలించి ఒక్కొక్క పశువుకు రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వల్లూరుపాలెం వద్ద నదిలో పెరుగుతున్న వరద తీవ్రత

తోట్లవల్లూరు: కృష్ణానదికి వరద ముప్పు పొంచి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సూచించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సుమారు మూడు లక్షల క్యూసెక్కుల వరకు కృష్ణానదికి వరద వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వరద రాక నేపథ్యంలో లంక గ్రామాలు, కరకట్ట వెంబడి గ్రామాల్లో 'టాం టాం' ద్వారా ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పడవలపై రాకపోకలు సాగించే లంక గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

జీవిత బీమా పాలసీలో తపాలా శాఖ టాప్

గుడివాడ పోస్టల్ ఎస్పీ ముత్యాల శ్రీనివాస్



కైకలూరు పోస్టాఫీసులో పాలసీ చెక్కును అందజేస్తున్న పోస్టల్ ఎస్పీ శ్రీనివాస్

కైకలూరు: ప్రమాద మరణాల్లో బాధితులకు అత్యధిక పాలసీ డబ్బులు చెల్లించేది తపాలా శాఖ మాత్రమేనని గుడివాడ పోస్టల్ ఎస్పీ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. కైకలూరు సబ్ పోస్టాఫీసులో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మరణించిన వారి కుటుంబానికి పాలసీ చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిదిండి ఇందిరా కాలనీకి చెందిన దండే విజయకుమార్ కిరణా కొట్టు పెట్టుకుని జీవించేవాడన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. ఏప్రిల్‌లో అతడు మరణించాడన్నారు. అంతకు ముందు ఏడాదికి గాను పోస్టల్‌లో నివా-భూపా పాలసీలో రూ.799 చెల్లించాడన్నారు. దీంతో ఆయనకు రూ.15 లక్షలు ప్రమాద బీమా కింద వచ్చిందన్నారు. అదేవిధంగా అతడే రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకంలో రూ.18 వేలు చెల్లించారన్నారు. దీని నిమిత్తం రూ.5.35 లక్షలు అందినట్లు తెలిపారు. రెండు నగదు చెక్కులు కలిపి రూ.20.35 లక్షలను నామినీగా పేర్కొన్న కుమార్తె అనితకు అందించామన్నారు. తక్కువ ప్రీమియంతో అత్యధిక బీమా సదుపాయం కల్పిస్తున్న తపాలాశాఖ సేవాలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కైకలూరు సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కందగిరి సురేష్ కుమార్, ఐపీపీబీ మేనేజర్ పి.గణేష్, మెయిల్ ఓవర్‌సీస్ జి.మోహన్ వర్మ, కె.ఏసుపాదం, సబ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో వెంటనే వీసీలను నియమించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

గుడివాడరూరల్: రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలోకి మార్పులు తీసుకురావడం, యూనివర్సిటీల్లో వీసీలను నియమించకపోవడం తాత్కాలిక వీసీలతో ఎన్ని రోజులు యూనివర్సిటీలను నడుపుతారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌నాయుడు ప్రశ్నించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు అయి రిజల్ట్స్ వచ్చి మూడు నెలలు గడిచినా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించలేదన్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ కల్పించాలని, మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా రంగంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి హారిక, ఉపాధ్యక్షుడు సలీం, ఎస్ఎఫ్ఐ నాయకులు సమరం, జగన్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జూనియర్ కాలేజీ ప్రవేశ దరఖాస్తులు

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశ దరఖాస్తుల ప్రక్రియ గురువారంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ ఎన్.ఆశాజ్యోతి బుధవారం తెలిపారు. ఈ ఏడాది 2025-26లో కాలేజీలో 178 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. గతేడాతో పోలిస్తే 35 మంది విద్యార్థులు పెరిగారని తెలిపారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యువతులకు ఐరన్ బిళ్లలు, ఉచిత శానిటరీ నాప్‌కిన్స్ అందిస్తుందని పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లక్ష్మి

మండవల్లి: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీ లక్ష్మి మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, డీవీకే గంగాధర్‌రావు, సీహెచ్ వెంకటప్పయ్య, ప్రిన్సిపాల్ పి.రవితేజ, హెడ్ కానిస్టేబుల్ బి.నాగశ్రీను, కళాశాల సిబ్బంది, లీగల్ సర్వీసెస్, పీఎల్‌వీలు పాల్గొన్నారు.